సాక్షి
నిజామాబాద్
శుక్రవారం | 25 | ఏప్రిల్ | 2025



ప్రియుడి కోసం..

ప్రియుడి కోసం భర్తను హత్య చేయించిన భార్యతోపాటు మరో ముగ్గురిని రామారెడ్డి పోలీసులు అరెస్టు చేశారు.

- 10లో ▸



పేద విద్యార్థుల..

పేద విద్యార్థుల కోసమే ప్రభుత్వ కళాశాలలని పోచారం అన్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
45.3 /23.3

న్యూస్‌రీల్

ఎకో టూరిజానికి సహకరించాలి

● రైతులతో అధికారుల చర్చలు



డొంకేశ్వర్(ఆర్మూర్) : ఎకో టూరిజం ఏర్పాటుకు రైతులు సహకరించాలని అధికారులు కోరారు. రెవెన్యూ, ఇరిగేషన్, అటవీ అధికారులు గురువారం డొంకేశ్వర్ మండలంలోని చిన్నయానం, గాదేపల్లి, జీజీ నడ్కుడ రైతులతో బ్యాక్ వాటర్ ప్రాంతంలో చర్చలు జరిపారు. వన్య ప్రాణులు, ప్రకృతి కలిగిన ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఎకో టూరిజం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. టూరిజం ఏర్పాటైతే ఇక్కడి గ్రామాల వారికి ఉపాధి లభిస్తుందని, ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. వాచ్ టవర్లు, రిసార్టుల ఏర్పాటు కోసం రైతులు ముందుకొచ్చి స్థల సమస్యను పరిష్కరించాలని కోరారు. స్థల సమస్య తీరిపోతే పై అధికారులకు నివేదికలు పంపిస్తామని, ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. తహసీల్దార్ నరేశ్‌కుమార్, డిప్యూటీ ఎఫ్ఆర్వో సుధాకర్, ఇరిగేషన్ ఏఈ రవి, సర్వేయర్ కిషన్ ఉన్నారు.

రామారెడ్డి ఎస్సైపై సస్పెన్షన్ వేటు

విధుల్లో నిర్లక్ష్యం చేయడంతో..

కామారెడ్డి క్రైం: విధుల్లో నిర్లక్ష్యాన్ని కనబరిచినందుకు జిల్లాలో మరో ఎస్సైపై సస్పెన్షన్ వేటు పడింది. రామారెడ్డి ఎస్సై నరేశ్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో గతేడాది ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. ఈ కేసు విచారణ విషయంలో ఫిర్యాదుదారు అనేకసార్లు పోలీసులను ఆశ్రయించినా విచారణ వేగవంతం చేయలేదు. కనీసం ప్రాథమిక విచారణ కూడా చేయలేదు. ఈ విషయం ఇటీవల ఎస్పీ రాజేశ్ చంద్ర దృష్టికి వచ్చింది. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ.. విచారణ జరిపించగా కేసు 48 గంటల్లో కొలిక్కివచ్చింది. కేసు విచారణలో ఎస్సై నరేశ్ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంపై ఎస్పీ ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో ఎస్సైని సస్పెండ్ చేశారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



మాక్లూర్: మండలంలోని మాక్లూర్ పోలీస్ స్టేషన్‌ను గురువారం రాత్రి సీపీ సాయి చైతన్య తనిఖీ చేశారు. సిబ్బంది పని తీరును, ఫిర్యాదులు, వాటి పరిష్కారంపై ఎస్సై రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో ఫ్రెండ్లీగా ఉండాలని సూచించారు. నార్త్‌జోన్ సీఐ శ్రీనివాస్ ఉన్నారు.

భగభగలు



గురువారం మధ్యాహ్నం 1.45 గంటలకు నిర్మానుష్యంగా మారిన నిజామాబాద్ నగరంలోని పులాంగ్ చౌరస్తా



చున్నీ కప్పుకుని వెళ్తున్న యువతులు

ప్రజలు భానుడి భగభగలను భరించలేకపోతున్నారు. జిల్లాలో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వరుసగా రెండో రోజూ రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధికంగా 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వేడిమి, వడగాలుల కారణంగా తెల్లారితేనే వాతావరణాన్ని చూసి ప్రజలు భయపడుతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు పట్టణాలు, మండల కేంద్రాల్లోని ప్రధాన రోడ్లు మధ్యాహ్నం 12 గంటల నుంచి నిర్మానుష్యంగా మారుతున్నాయి. తప్పనిపరిస్థితుల్లో బయటికి వచ్చే వారు ఎండ తీవ్రత నుంచి తమను తాము రక్షించుకునేందుకు నానాపాట్లు పడుతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



వడగాలి నుంచి రక్షించుకునేందుకు మాస్కులు ధరించి గొడుగుతో వెళ్తున్న ప్రైవేట్ ఆస్పత్రి సిబ్బంది





ఎండనుంచి రక్షణగా టవల్స్, టోపీలు, స్కార్ఫ్‌లు కట్టుకొని వెళ్తున్న వాహనదారులు



చంటిబిడ్డతో చెట్టు నీడలో తల్లి..



టోపీ ధరించి వెళ్తున్న వాహనదారుడు, బాలుడు

జేబులు నింపుతున్న సర్దుబాటు

● ఇష్టారాజ్యంగా సీఆర్‌పీల బదిలీలు
● ఏళ్లుగా ఒకేచోట కొనసాగుతున్న కొందరు

నిజామాబాద్ అర్బన్ : బోధన పద్ధతులతోపాటు వివిధ అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే క్లస్టర్ రీసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)లకు విధుల కేటాయింపులో జిల్లా విద్యాశాఖ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీఆర్‌పీల సర్దుబాటు శాఖలోని పలువురు సిబ్బంది జేబులో నింపుతోంది. ఓవైపు లోకల్ నిబంధనను పట్టించుకోకుండా కాసులు ఇచ్చిన వారిని అనుకున్న చోటికి బదిలీ చేస్తుండగా, మరోవైపు ఏళ్లుగా కొందరు ఒకే చోట కొనసాగుతున్నా, పలుచోట్ల ఖాళీలు ఉన్నా పట్టించుకోవడం లేదు.

- ఎడపల్లిలో సీఆర్‌పీ నియామకంలో రోస్టర్ పాయింట్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ఒకే మండలంలో విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం.
- ఇందల్వాయి మండలం నల్లవెల్లి క్లస్టర్ నుంచి రవిని మాక్లూర్ మండలం గొట్టుముక్కల క్లస్టర్‌కు డిప్యుటేషన్‌పై పంపించారు. నవీపేట, నందిపేట పక్కనే ఉన్నప్పటికీ ఆయా మండలా ల నుంచి సీఆర్‌పీని గొట్టుముక్కలకు కేటాయించలేదు.



- కోటగిరి మండలం పొతంగల్ నుంచి నిజామాబాద్ రూరల్ మండలం తిర్మన్‌పల్లి పాఠశాలకు హనుమంతు అనే సీఆర్‌పీకి డిప్యుటేషన్ వేశారు.
- డిచ్‌పల్లి నుంచి సుమన్ అనే సీఆర్‌పీని అర్సపల్లి పాఠశాలకు కేటాయించారు. అయితే జిల్లా అధికారుల ఒత్తిడి భరించలేక సుమన్ గతేడాది తన ఉద్యోగానికి రాజీనామా చేశారు.
- బోధన్ మండలం కల్దుర్కి నుంచి నవీపేట మండలం నాగేపూర్ పాఠశాలకు ఒకరికి, మోర్తాడ్ నుంచి ఆర్మూర్‌కు మరొకరికి డిప్యుటేషన్‌పై ఇచ్చారు.
- ఎడపల్లి, జక్రాన్‌పల్లి, నందిపేట మండలాల్లో ఇద్దరు చొప్పున సీఆర్‌పీలు కొనసాగుతున్నారు. ఖాళీలు ఉన్న క్లస్టర్లకు వీరిని పంపించాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు.
- గతేడాది 94 మందిలో కేవలం ఐదుగురికి మాత్రమే సర్దుబాటు చేశారు. జిల్లాలో 81 కాంప్లెక్స్ పాఠశాలలు ఉండగా 94 మంది సీఆర్‌పీలు పనిచేస్తున్నారు. ప్రస్తుతం కూడా సీఆర్‌పీలను సర్దుబాటు చేయాలని ఇటీవలే ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కాసులిస్తే ఓకే

సీఆర్‌పీల సర్దుబాటు ప్రక్రియలో కాసులు ఇచ్చిన వారిని అనుకున్న ప్రాంతంలో సర్దుబాటు చేస్తున్నారు. ప్రతి ఏటా సీఆర్‌పీల సర్దుబాటులో ముగ్గురు ఉద్యోగులు లక్షలాది రూపాయలు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై విద్యాశాఖకు ఫిర్యాదు అందగా విచారణ కొనసాగుతోంది.

విచారణ చేపడతాం

సీఆర్‌పీల సర్దుబాటు ప్రక్రియపై విచారణ చేపడుతాం. అన్ని ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో సీఆర్‌పీలు ఉండేవిధంగా చూస్తాం. సీఆర్‌పీలు ఎప్పటి నుంచి పనిచేస్తున్నారు? ఏఏ ప్రాంతాల్లో ఎంత మంది ఉన్నారనే వివరాలను సేకరించి విచారిస్తాం.

– అశోక్, డీఈవో

రైతు ప్రయోజనాల కోసమే 'భూ భారతి'



వేల్పూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు



పహల్గామ్ మృతులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

మోర్తాడ్/ వేల్పూర్ : రైతు ప్రయోజనాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. ధరణి స్థానంలో భూ భారతి పోర్టల్‌ను అమలు చేస్తోందని, దీనిపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. భీమ్‌గల్, వేల్పూర్ మండలాల్లో గురువారం నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూ సమస్యలుంటే భూ భారతి ద్వారా పరిష్కారానికి తహసీల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలున్నా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. భూ భారతి ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సదస్సులో జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ రమేశ్ రెడ్డి, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సారెడ్డి, ఆర్మూర్ ఆర్డీవో రాజుగౌడ్, భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, భీమ్‌గల్, వేల్పూర్ తహసీల్దార్లు షబ్బీర్, సంతోష్ పాల్గొన్నారు.

పహల్గామ్ మృతులకు నివాళి

మోర్తాడ్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు, రైతులు నివాళులు అర్పించారు. భీమ్‌గల్, వేల్పూర్‌లలో నిర్వహించిన భూ భారతి రైతు అవగాహన సదస్సు ప్రారంభానికి ముందు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

పహల్గామ్ దాడి హేయమైన చర్య

వేల్పూర్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి హేయమైన చర్య అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం సాయంత్రం పార్టీ నాయకులతో కలిసి పహల్గామ్ మృతులకు నివాళులర్పించి మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తీవ్రవాదులు అమాయక పర్యాటకులపై చేసిన దాడిని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. భారతదేశాన్ని ఎదుర్కొనే దమ్ములేక శత్రుదేశాలు చేస్తున్న పికిరిపంద చర్యగా అభివర్ణించారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా భద్రత కట్టుదిట్టంపై కేంద్రం దృష్టి సారించాలన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

శేఖర్‌గౌడ్‌కు కీలక బాధ్యతలు



మీనాక్షి నటరాజన్‌తో శేఖర్‌గౌడ్

● కాంగ్రెస్ నిర్మల్ జిల్లా పరిశీలకుడిగా నియామకం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాడ్సి శేఖర్‌గౌడ్‌కు పార్టీ నాయకత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్ వచ్చిన తరువాత క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయడంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా క్రమశిక్షణ కలిగినవారికే పార్టీ పరమైన కీలక బాధ్యతలు అప్పగించారు. జిల్లా నుంచి బాడ్సి శేఖర్‌గౌడ్‌కు నిర్మల్ జిల్లా పరిశీలకుడిగా బాధ్యతలు అప్పగించారు. నిర్మల్‌లో మండల, బ్లాక్, జిల్లా అధ్యక్షుల ఎంపికలో శేఖర్‌గౌడ్ కీలక పాత్ర పోషించనున్నారు. జిల్లా అధ్యక్ష పదవికి ఎంపిక చేసేందుకు ఐదుగురి పేర్లను, ఒక్కో బ్లాక్ అధ్యక్షుల కోసం ముగ్గురిని, మండల అధ్యక్ష పదవుల ఎంపిక కోసం ఐదు చొప్పున పేర్లను ఎంపిక చేసి నాయకత్వానికి పంపించాల్సి ఉంది. ఇప్పటికే రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి రేసులో ఉన్న శేఖర్‌గౌడ్, ప్రస్తుతం తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వహించేందుకు రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తానని తెలిపారు.

కామారెడ్డికి వేణుగోపాల్‌యాదవ్

కామారెడ్డి కాంగ్రెస్ పరిశీలకుడిగా కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్‌యాదవ్ నియమితులయ్యారు. పార్టీ పటిష్టతే ధ్యేయంగా కమిటీల నియామకం జరగాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ సూచించినట్లు వేణుగోపాల్ తెలిపారు.

దేశాభివృద్ధికి బీజేపీ కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కొమురయ్య

● ఉగ్రదాడికి కేంద్రం ప్రతీకారం తీర్చుకుంటుంది
● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

సుభాష్‌నగర్: దేశాభివృద్ధికి భారతీయ జనతా పార్టీ కృషి చేస్తోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారితో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోని వక్ఫ్‌బోర్డు ఆస్తులన్నీ కొద్దిమంది చేతుల్లోనే ఉన్నాయని, సామాన్య ముస్లిములకు వక్ఫ్‌బోర్డు ఫలాలు అందడం లేదని, చట్టసవరణతో వారికి ప్రయోజనం చేకూరుస్తామని పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి కేంద్ర ప్రభుత్వం ప్రతీకారం తీర్చుకుంటుందని, ఇప్పటికే చర్యలు ముమ్మరం చేసిందన్నారు. విపత్కర పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తిచేశారు. దినేశ్ కులాచారి మాట్లాడుతూ.. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని అసాంఘిక శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, ఇలాంటి సమయంలో హిందువులందరూ జాగృతం కావాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు పహల్గామ్ అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో నాయకులు న్యాలం రాజు, గోపిడి స్రవంతిరెడ్డి, శంకర్, సంతోష్, ఆమంద్ విజయ్, యాదాల నరేశ్, తారక్ వేణు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి బీజేపీ అడ్డుపడుతోంది

● గుజరాతీలకు గులాంగిరి చేస్తున్నారు
● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి : రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి శాయశక్తులా కృషి చేస్తుంటే బీజేపీ ఎంపీలు అడ్డుపడుతూ గుజరాతీలకు గులాంగిరి చేస్తున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి విమర్శించారు. మండలంలోని సీతాయిపేట్, మద్దుల్ తండా, వాడి, హొన్నాజీపేట్, నడిమితండా, కొటాలపల్లి గ్రామాల్లో రూ.9 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం భూపతిరెడ్డి శంకుస్థాపన చేసి మాట్లాడారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతోనే దాడి జరిగిందని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సన్నబియ్యం పంపిణీలో కేంద్రం వాటా ఉందని గొప్పలు చెప్పుకునే బీజేపీ, వారి ప్రభుత్వం ఉన్న రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల హామీలకు కట్టుబడి ఉన్నామని, ఐదేళ్లలోపు హామీలు అమలు చేసి తీరుతామన్నారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకొని దివాలా పరిచిందని ఆరోపించారు. ఆయనవెంట మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ బాలరాజ్, నాయకులు చెలిమెల నర్సయ్య, మిట్టపల్లి గంగారెడ్డి, భగవాన్‌రెడ్డి, రాజేందర్ తదితరులు ఉన్నారు.



వాడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

వరంగల్ సభతో కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ఖాయం

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్ : బీఆర్ఎస్ వరంగల్ సభతో కాంగ్రెస్ సర్కారు పతనం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి ఎన్నికల హామీలను పాతరేసిన కాంగ్రెస్.. పదహారు నెలల పాలనలో సీఎం రేవంత్ రెడ్డి ఫ్యామిలీ తప్ప ఎవరూ సంతోషంగా లేరన్నారు. తెలంగాణ సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని జీవన్ రెడ్డి అన్నారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తి వద్ద జరగనున్న బీఆర్ఎస్ ప్లీనరీ మహాసభకు తరలివెళ్లేందుకు జిల్లా వ్యాప్తంగా గులాబీ శ్రేణులు సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాతో బీఆర్ఎస్‌ది పేగు బంధమన్నారు. పార్టీకి పూర్వవైభవం తేవడంలో, కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చేయడంలో కూడా నిజామాబాద్ జిల్లా ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. 'ఇందూరు జిల్లా పంతం, ఇందిరమ్మ హింసారాజ్యం అంతం' అనే దీక్షతో వరంగల్ బాటపడదామన్నారు. వరంగల్ రజతోత్సవ మహాసభ స్ఫూర్తిగా ఆర్మూర్ నియోజకవర్గంలో 'గులాబీ ఆర్మీ పంతం .. దుష్ట కాంగ్రెస్, భ్రష్ట బీజేపీల అంతం' అనే దీక్ష చేపడదామని జీవన్‌రెడ్డి తెలిపరు. బీఆర్ఎస్ రజతోత్సవం తెలంగాణ ఇంటి పార్టీ పండుగగా అభివర్ణించారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుజీత్‌సింగ్, సత్యప్రకాశ్, శేఖర్, రాజేశ్వర్ రెడ్డి, వెల్మల్ రాజన్న, మచ్చర్ల సాగర్, మాస్త ప్రభాకర్, పూజ నరేందర్, ముత్యం, రజనీష్, పోల సుధాకర్, అభిలాష్, ఏజాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన న్యాయవాదులు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి భరతలక్ష్మిని గురువారం ఆమె కార్యాలయంలో న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో న్యాయ వ్యవస్థ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. సీనియర్ న్యాయవాది వసంతరావు తదితరులుపాల్గొన్నారు.

తెయూ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా వాసం చంద్రశేఖర్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా వాసం చంద్రశేఖర్ నియామకమయ్యారు. ఈమేరకు తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి గురువారం చంద్రశేఖర్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం వర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా వాసం చంద్రశేఖర్ కొనసాగుతున్నారు. వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్‌పీ నోడల్ ఆఫీసర్‌గా, రూసా కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

పీజీ ఇంటిగ్రేటెడ్ రెగ్యులర్ పరీక్షలు ప్రారంభం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ పరీక్ష కేంద్రంలో గురువారం పీజీ ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సులకు సంబంధించిన 6, 8, 10వ సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాన్ని వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి తనిఖీ చేశారు. ఉదయం జరిగిన 8వ సెమిస్టర్ పరీక్షలకు 38 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పదవ సెమిస్టర్ పరీక్షలకు 15 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, పీఆర్‌వో పున్నయ్య, అడిషనల్ కంట్రోలర్ సంపత్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

బ్యాక్ వాటర్‌లో పంటల సాగు



దొంకేశ్వర్(ఆర్మూర్): ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ తగ్గిపోవడంతో ముంపు నుంచి తేలిన భూముల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ప్రతియేటా వేసవిలో నీరు తగ్గడంతో తేలిన భూముల్లో స్థానిక రైతులు పలు పంటలను సాగుచేస్తారు. చిన్నయానం, జీజీ నడ్కుడ, గాదేపల్లి శివార్లలో పంటలు వేసేందుకు భూములను దుక్కి దున్నుతున్నారు. భూమిలోని నీటి తేమతోనే పంటలు పండనున్నాయి. వర్షాలు మొదలై వరద నీరు వచ్చే నాటికి పంటలు తమ చేతికి వస్తాయని రైతులు చెబుతున్నారు.

పేద విద్యార్థుల కోసమే ప్రభుత్వ కళాశాలలు

- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- ఘనంగా ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



బాన్సువాడ ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాలలో పైలాన్‌ను ఆవిష్కరించిన పోచారం, షెట్కార్, అధికారులు

బాన్సువాడ: గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేద విద్యార్థుల కోసమే ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయని, అందులోభాగంగానే బాన్సువాడలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశామని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీరాంనారాయణ్‌ఖేడియా (ఎస్‌ఆర్‌ఎన్‌కే) ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిల్వర్‌జూబ్లీ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాలలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాపంగా రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తాను 1994లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు ఇక్కడి ప్రజలు, విద్యార్థుల కోరిక మేరకు అప్పటి సీఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడి 1997లో డిగ్రీ కళాశాల మంజురు జీవో విడుదల చేయించానన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కళాశాలలో 13053 మంది విద్యార్థులు విద్యనభ్యసించగా, వారిలో సుమారు 10వేల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత సాధించడానికి అధ్యాపకుల కృషి చాలా ఉందని అన్నారు. కళాశాల కోసం శ్రీరాంనారాయణ్‌ఖేడియా తన 11.15 ఎకరాల ఫ్యాక్టరీ భూమిని ఉచితంగా ఇచ్చారని అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు రావాల్సి ఉండగా, చివరి నిమిషంలో మంత్రి పర్యటన రద్దయిందని అన్నారు.

బాధ్యతగా ఉండాలి

డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు పట్టాతో కాకుండా మంచి వ్యక్తిత్వం, లక్ష్యంతో బయటకి రావాలని, భవిష్యత్‌లో విద్యనే కాకుండ, బాధ్యత కూడా ఉండాలని విద్యాశాఖ కమిషనర్ దేవసేన అన్నారు. తాను కమిషనర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మొట్టమొదటిసారిగా ఫీల్డ్ విజిట్‌కు రావాల్సివచ్చిందని, దీనికి కారణం పోచారం శ్రీనివాస్‌రెడ్డి అని అన్నారు. కళాశాల కోసం స్థలం ఇచ్చిన గొప్ప వ్యక్తి శ్రీరాంనారాయణ్‌ఖేడియా అని అన్నారు. ఎల్లారెడ్డి, నారాయణ్‌ఖేడ్ డిగ్రీ కళాశాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తప్పక రావాలని విద్యాశాఖ కమిషనర్ దేవసేనను ఎంపీ సురేష్‌షెట్కార్ ఆహ్వానించారు. వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. బాన్సువాడ, బోధన్ సబ్‌కలెక్టర్లు కిరణ్మయి, వికాస్ మహంత్, శ్రీరాంనారాయణ్‌ఖేడియా మనువడు రోహిత్ ఖేడియా, జైళ్ల శాఖ ఐజీ మురళీబాబు, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, బద్యనాయక్, కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాలస్వామి తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటిన కలెక్టర్



నస్రుల్లాబాద్‌లో క్షతగాత్రులను తన వాహనంలో తరలించాలని సూచిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నస్రుల్లాబాద్: కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మానవత్వం చాటుకున్నారు. నస్రుల్లాబాద్ మండలం అంకోల్ తండాకు చెందిన గుగ్లోత్ మాంగ్యా, గుగ్లోత్ దేమ్యా గురువారం మండల కేంద్రం నుంచి తండాకు బైక్‌పై బయలుదేరారు. బొమ్మన్‌దేవ్‌పల్లి క్రాస్ రోడ్డు సమీపంలో వీరి బైకు అదుపు తప్పడంతో ఇద్దరు కిందపడి గాయపడ్డారు. కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలంలో పర్యటించి తిరుగు ప్రయాణంలో జిల్లాకేంద్రానికి వెళుతుండగా క్షతగాత్రులను చూసి ఆగారు. వెంటనే వారిని ఆయన కారులో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సిబ్బందిని తోడుగా ఇచ్చి పంపించారు. అంబులెన్స్ వచ్చేవరకు చూడకుండా కలెక్టర్ సొంత వాహనంలో క్షతగాత్రులను పంపడంపై కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రియుడి కోసం భర్తను చంపించిన భార్య

- ఏడాది తర్వాత వెలుగులోకి ఘటన
- వివరాలను వెల్లడించిన కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

రామారెడ్డి: ప్రియుడి కోసం భర్తనే హత్య చేయించిందో ఇల్లాలు. ఏడాది తర్వాత ఈ ఘటన వెలుగులోకి రావడం గమనార్హం. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి తెలిపారు. రామారెడ్డి మండలం ఇసన్నపల్లికి చెందిన గొల్ల తిరుపతి(45) గతంలో గల్ఫ్ దేశంలో పనిచేసి రెండేళ్ల క్రితం సొంతూరుకు తిరిగి వచ్చాడు. కొంతకాలానికే కనిపించకుండా పోయాడు. 14 నెలలు గా తిరుపతి కనిపించకపోవడంతో అతడి అన్న గొల్ల నాగమల్లయ్య ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో అనేక అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయి. తుది విచారణలో తిరుపతిని భార్యే హత్య చేయించినట్లు తేలిందని ఏఎస్పీ చైతన్యరెడ్డి తెలిపారు. కేసును ఛేదించిన కామారెడ్డి రూరల్ సీఐ రామన్, క్రైం టీం సిబ్బందిని ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

వివాహేతర సంబంధమే కారణం..

గొల్ల తిరుపతి భార్య మణవ్వకు అదే గ్రామానికి చెందిన కందూరి లింబయ్యతో వివాహేతర సంబంధం ఏర్పడింది. తిరుపతి గల్ఫ్‌నుంచి తిరిగి రావడంతో వారికి అడ్డంకిగా మారాడు. దీంతో భార్య అతడి అడ్డు తొలగించుకోవాలని భావించి, హత్య చేయించడానికి కుట్ర పన్నింది. కందూరి లింబయ్య అతడి స్నేహితులైన షేక్ హయత్ బాషా, ధరణి లింబయ్యలతో మాట్లాడి తిరుపతిని హత్య చేయడానికి డబ్బులు ఇచ్చాడు. గతేడాది ఫిబ్రవరి 19న రాత్రి మద్యం తాగుదామంటూ తిరుపతిని వారు కారులో రామారెడ్డి నుంచి నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని డొంకల్ గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ అతడికి మద్యం తాగించి, మత్తులో ఉన్న సమయంలో మెడకు టవల్ చుట్టి హత్యచేశారు. అనంతరం పెట్రోల్ పోసి మృతదేహాన్ని తగులబెట్టారు. మరుసటిరోజు ఎముకలను అక్కడే గొయ్యి తీసి పూడ్చిపెట్టారు. తిరుపతి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ జరపగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులు చూపిన ఆధారాల మేరకు తహసీల్దార్ ఆధ్వర్యంలో గురువారం మృతుడి అవశేషాలు బయటకు తీసి పంచనామా నిర్వహించారు. నిందితులు కందూరి లింబయ్య ఏ-1గా, షేక్ హయత్ బాషా ఏ-2, ధరణి లింబయ్య ఏ-3, గొల్ల మణవ్వ ఏ-4గా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి కారు, బైకు, నగదు స్వాధీనం చేసుకున్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



కమలాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ అంకిత్

అదనపు కలెక్టర్ అంకిత్

డిచ్‌పల్లి: అర్హులైన పేదలందరూ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని, ప్రస్తుతం కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. డిచ్‌పల్లి మండలం కమలాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి మంజూరైన ఇళ్లు, ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయనే వివరాలను పంచాయతీ కార్యదర్శి సుమతిని అడిగారు. మొత్తం 100 ఇళ్లు మంజూరు కాగా 27 మంది ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసుకున్నారని, 5 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌కు వచ్చాయని కార్యదర్శి తెలిపారు. ముగ్గురు లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున డబ్బులు మంజూరైనట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలసాని శ్రీనివాస్ అదనపు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం లబ్ధిదారు కుమ్మరిపల్లి సుజాత ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోశారు. మిగిలిన లబ్ధిదారులు కూడా ఇళ్లు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో నివేదిత, కాంగ్రెస్ నాయకులు పెద్దోళ్ల శ్రీనివాస్, గోపాల్, ఆశ రెడ్డి, పోశెట్టి, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



వేల్పూర్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కచ్చితంగా వేయించాలని జిల్లా పశు సంవర్ధక అధికారి రోహిత్‌రెడ్డి అన్నారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని మండలంలోని లక్కోరలో గురువారం తనిఖీ చేశారు. రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు భారం కాకుండా ప్రభుత్వం గాలికుంటు వ్యాధి నివారణ కోసం పశువులకు ఉచిత టీ కాలను వేయిస్తోందన్నారు.

వ్యక్తి అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గడీరోడ్‌లో నివాసం ఉండే చించేలి సాయాగౌడ్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి గురువారం తెలిపారు. కూలీ పని చేసుకునే అతడు ఈ నెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. కుటుంబసభ్యులు చాలాచోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో అతడి భార్య స్వరూప పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తికి ఘనంగా వీడ్కోలు



న్యాయమూర్తిని సన్మానిస్తున్న న్యాయవాదులు

కామారెడ్డి టౌన్: జిల్లా కోర్టులో అదనపు జిల్లా న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న లాల్ సింగ్ శ్రీనివాస్‌ను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికలతో సత్కరించారు. ఆయన మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా న్యాయమూర్తి వి. ఆర్.ఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. ఉత్తమ సేవలు అందిస్తేనే మంచి గుర్తింపు వస్తుందన్నారు. న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగరాణి, సీనియర్, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు సుమలత, సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేష్, ప్రధాన కార్యదర్శి బండారి సురేందర్ రెడ్డి,ఉపాధ్యక్షుడు మురళి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాక్లూర్ సొసైటీ డైరెక్టర్ రాజీనామా

మాక్లూర్: మాక్లూర్ వ్యవసాయ పరపతి సంఘం మాదాపూర్ డైరెక్టర్- 2 పదవికి జిట్టా చిన్న గంగాధర్ రాజీనామా చేశారు. గురువారం జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్‌కు లేఖను అందజేశారు. సొసైటీలో జరుగుతున్న అంతులేని అవినీతిని చూసి తట్టుకోలేకే రాజీనామా చేస్తున్నట్టు గంగాధర్ పేర్కొన్నారు. సొసైటీ అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోకపోవడం తీవ్ర మనస్థాపానికి గురి చేసిందని గంగాధర్ 'సాక్షి'తో చెప్పారు.

క్రైం కార్నర్

రామారెడ్డిలో ఒకరి ఆత్మహత్య



చిన్న భీమయ్య (ఫైల్)

రామారెడ్డి: మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రామారెడ్డికి చెందిన మంగలి చిన్న భీమయ్య (49) బుధవారం రాత్రి కుటుంబ సభ్యులందరితో కలిసి భోజనం చేశారు. మనుమరాల్ని భీమయ్య కొట్టడంతో ఎందుకు కొట్టావని కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. ఈక్రమంలో అతడు కుటుంబ సభ్యులతో గొడవకు దిగాడు. కొద్దిసేపటికి గొడవ సద్దుమణిగిన తర్వాత నిద్రిస్తున్న సమయంలో భీమయ్య ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఉదయం కోడలు లేచే సమయానికి కొన ఊపిరితో ఉండడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఏఎస్సై రవీందర్ తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్‌లో గురువారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. వారి నుంచి రూ.1,180 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

సమయపాలన పాటించని దుకాణ యజమానికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: నగరంలోని మాలపల్లికి చెందిన మాక్సూద్ ఖాన్ తన గ్రాండ్ ప్లాజా హోటల్‌ను ఈనెల 22న రాత్రి సమయం దాటిన తర్వాత కూడా వ్యాపార కార్యకలాపాలు కొనసాగించడంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. గురువారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఎక్లాస్‌పూర్ కార్యదర్శిపై విచారణ



విచారణ జరుపుతున్న డీపీవో శ్రీనివాస్‌రావు

రుద్రూర్: కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్ జీపీ కార్యదర్శి పనితీరుపై గురువారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు విచారణ జరిపారు. కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు ఫిర్యాదు రావడంతో డీపీవో గ్రామానికి వచ్చి విచారణ జరిపారు. గ్రామంలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. అనంతరం రుద్రూర్ మండల కేంద్రంలో నిర్వహించిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో డీపీవో పాల్గొని, జీపీ కార్మికులను సన్మానించారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. డీఎల్‌పీవో నాగరాజు, జీపీ కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లారీ బోల్తా



ధర్పల్లి: మండలంలోని వాడీ వాగు వద్ద వరి ధాన్యాన్ని తరలిస్తున్న లారీ బుధవారం రాత్రి అదుపుతప్పి బోల్తా పడింది. హొన్నాజీపేట్ ఐకేపీ కేంద్రం నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలో నిజామాబాద్ రైస్‌మిల్‌కు తరలిస్తుండగా వాగు వద్దనున్న సర్వీస్ రోడ్డుపై బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. లారీ బోల్తా పడడంతో ధాన్యం బస్తాలను మరో లారీలో రైస్‌మిల్‌కు కేంద్రం నిర్వాహకులు తరలించారు.

కొడిచర్లలో ఇసుక ట్రాక్టర్..



రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల శివారులో ఇసుక ట్రాక్టర్ బోల్తా పడింది. మంజీరా నది నుంచి గురువారం అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా అదుపుతప్పి సమీపంలోని పొదల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు కాగా అతడిని చికిత్స నిమిత్తం స్థానికులు బోధన్ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో పాత జాతీయ రహదారిపై హార్వెస్టర్ ఢీకొని ఒకరు మృతిచెందారు. ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. ముప్కాల్‌కు చెందిన మణికాంత్‌రెడ్డి(31) బుధవారం రాత్రి కాలినడకన రోడ్డుపై వెళ్తుండగా బాల్కొండ వైపు నుంచి ముప్కాల్ వైపు వస్తున్న హార్వెస్టర్ ఢీకొట్టి, ఆయన పైనుంచి వెళ్లింది. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడటంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఏలేటి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

చెట్టు పైనుంచి పడి వృద్ధుడు..



పెంటయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేటలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చింతచెట్టు పైనుంచి కింద పడడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన చాకలి పెంటయ్య(67) ఇటీవల మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామంలో గల తన బంధువైన చిన్నమోల్ల శివనీల ఇంటికి వచ్చాడు. కాగా బుధవారం పెంటయ్య నాగిరెడ్డిపేటలోని తన బంధువు ఇంటివెనక గల చింతచెట్టు పైకెక్కి చింత కాయలు తెంపే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతడికి గాయాలు కావడంతో స్థానికులు ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరు..



మృతి చెందిన రాజేందర్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మిట్టాపల్లి గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. డిచ్‌పల్లి ఎస్సై మహ్మద్ షరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. డిచ్‌పల్లి గ్రామానికి చెందిన నాయికిడి రాజేందర్ (40), అదే గ్రామానికి చెందిన బంధువు నాయికిడి రవితో కలిసి గురువారం ఉదయం బైక్‌పై రాంపూర్ గ్రామానికి వెళ్లారు. కొద్ది సేపటికి తిరిగి డిచ్‌పల్లికి వస్తుండగా మిట్టాపల్లి గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకువెళ్లింది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి వెంటనే వారిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాజేందర్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రవి పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు గతంలోనే చనిపోయారు. ఇంకా పెళ్లి కాలేదు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. రెండు రోజుల క్రితమే గ్రామానికి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇంతలోనే ఇలా మృతిచెందడం బాధాకరమైన విషయమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజేందర్ చెల్లెలు కొండూరు లాస్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ..

రెంజల్(బోధన్): రెంజల్ మండల కేంద్రానికి చెందిన మోతిలాల్(42) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. 20 రోజుల కిందట ఇంట్లో గ్యాస్ సిలెండర్ లీకయి అగ్ని ప్రమాదం జరుగగా మోతిలాల్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..



బాపురాజు (ఫైల్)

కామారెడ్డి క్రైం: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ఆకుల చిన్న బాపురాజు (45) వ్యవసాయం చేసుకునేవాడు. బుధవారం ఉదయం మెదక్ జిల్లాకు చెందిన ఓ దంపతులు అతడి ఇంటికి వచ్చి అదే గ్రామంలో మరో ఇద్దరు వ్యక్తులు తీసుకున్న అప్పుకు గ్యారెంటర్‌గా ఉన్న విషయంలో మాట్లాడారు. అప్పు తీసుకున్న వారి ఇంటికి తీసుకువెళ్తానని చెప్పి బాపురాజు వారితో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 12 గంటల ప్రాంతంలో బాపురాజును గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులైన శ్రీనివాస్, రాజశేఖర్‌లు ఇంటికి తీసుకువచ్చి పడుకోబెట్టి వెళ్లిపోయారు. బాపురాజు భార్య శకుంతల అడిగితే మద్యం మత్తులో ఉన్నాడని చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంత లేపినా లేవకపోవడంతో అనుమానం వచ్చి అతడిని కుటుంబ సభ్యులు కామారెడ్డిలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడి తలకు గాయం ఉండటంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

గజ్వేల్‌లో చుక్కాపూర్ వాసి..

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన ఒకరు సిద్దిపేట జిల్లా గజ్వేల్ సమీపంలో గురువారం అనుమానాస్పదంగా మృతిచెందినట్టు గ్రామస్తులు గురువారం తెలిపారు. మూడు రోజుల కిందట కొమురవెల్లిలో కొబ్బరికాయలు అమ్మడానికి వెళ్లిన పర్శరాములు (40) గజ్వేల్ శివారులో అనుమానాస్పదంగా చనిపోయి ఉన్నట్టు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో వారు, చుక్కాపూర్ గ్రామస్తులు అక్కడికి వెళ్లారు.

చెరువులో పడి బాలుడు..



రుత్విక్‌రాజ్ (ఫైల్)

మాచారెడ్డి: చెరువులో పడి నాలుగేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన గురువారం పాల్వంచ మండలం భవానీపేట గ్రామంలో చోటుచేసుకుంది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా.. రామారెడ్డికి చెందిన దండబోయిన రుత్విక్‌రాజ్ (4) అనే బాలుడు తల్లిదండ్రులతో కలిసి భవానీపేట గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయానికి దర్శనం కోసం వచ్చారు. తల్లిదండ్రులు పూజలో నిమగ్నమై ఉండగా రుత్విక్‌రాజ్ ఆడుకుంటూ తప్పిపోయాడు. సాయంత్రం వరకు గ్రామ శివారులో వెతుకుతుండగా భవానీపేట చెరువులో శవమై తేలాడు. దీంతో ఆగ్రహం చెందిన రామారెడ్డి గ్రామస్తులు చెరువులో గుంతలు తీయడం వల్లే బాలుడు మృతి చెందాడని ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న మాచారెడ్డి ఎస్సై అనిల్ పోలీసు బలగాలతో ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

గుర్తుతెలియని వృద్ధురాలు..

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలోని పాతూరులో గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందింది. నందిపేటలోని పాతూర్ గ్రామ శివారులో సుమారు మూడు నాలుగు రోజుల క్రితం మలవిసర్జనకై ఆమె వెళ్లగా కుడి కాలికి ఉన్న వెండి కడియం, గెట్టుపై ఉన్న ఇనుప కంచకు తట్టుకొని ప్రమాదవశాత్తు కిందపడి చనిపోయినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మృతురాలు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల వయసు ఉంటుందన్నారు. మృతురాలి ఒంటిపైన పసుపురంగు చీర, గులాబీరంగు స్వెటర్, కుడి కాలికి వెండి కడియం ఉన్నదన్నారు. స్థానికుడు వాసవి రామ్‌చందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.